క్లుప్తంగా

లక్ష్మీతిరుపతమ్మ కల్యాణ వేదిక నిర్మాణానికి విరాళాలు



గన్నవరం: స్థానిక పాత గన్నవరంలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న కల్యాణ వేదిక నిర్మాణానికి శనివారం భక్తులు రూ.2 లక్షలు విరాళంగా అందజేశారు. గన్నవరానికి చెందిన కాసన్నేని బాబురావు, బేబీసరోజిని దంపతులు రూ. 1,00,116, నర్రా గిరిధర్, సౌభాగ్యలక్ష్మి దంపతులు రూ.1,00,008 విరాళం చెక్కులను ఆలయ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ మాట్లాడుతూ.. శ్రీలక్ష్మీతిరుపతమ్మ కల్యాణ వేదిక నిర్మాణానికి భక్తులు స్వచ్ఛందంగా ముందుకువచ్చి తమవంతు తోడ్పాటునందించడం అభినందనీయమన్నారు. త్వరితగతిన కల్యాణ వేదికను పూర్తిచేసి భక్తుల సౌకర్యార్థం అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

అనధికార కట్టడం కూల్చివేత

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ కానూరులో అనధికార కట్టడాన్ని శనివారం కూల్చివేశారు. గ్రామంలోని కమల రెసిడెన్సీ అపార్టుమెంట్‌లో పార్కింగ్ ప్రాంతంలో అనధికార కట్టడం చేశారు. దీనిపై ఫిర్యాదులు అందడంతో మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారులు ఆ కట్టడాన్ని కూల్చి వేశారు. మున్సిపాలిటీ పరిధిలో అనధికార కట్టడాలు చేస్తే చర్యలు తీసుకుంటామని టౌన్ ప్లానింగ్ అధికారులు తెలిపారు.

దాతల సాయం అభినందనీయం



కంకిపాడు: దాతల సాయం అభినందనీయమని పునాదిపాడు జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వరరావు అన్నారు. పాఠశాలలో 1977వ సంవత్సరం విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు పాఠశాలకు అవసరమైన 20 ఫ్యాన్‌లు, 10 ట్యూబ్‌లైట్లు, 20 కండెన్సర్లను శనివారం అందజేశారు. హెచ్‌ఎం మాట్లాడుతూ పూర్వ విద్యార్థి శరణం ప్రసాద్, అతని స్నేహితుల బృందం పాఠశాలలో విద్యుత్ ఉపకరణాలను సమకూర్చడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ దాతృత్వగుణాన్ని అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయ భూముల కౌలుకు వేలంపాట

పెనమలూరు: మండల పరిధిలో రెండు దేవాలయాలకు చెందిన భూముల సాగుకు కౌలు వేలంపాట నిర్వహించనున్నామని ఆలయ ఈఓ బీ సుబ్బారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడిగడపలోని శ్రీ సీతారామస్వామివారి దేవస్థానానికి చెందిన ఆర్‌ఎస్ నెంబర్ 135లోని 4.94 ఎకరాల సాగు భూమిని 2025-26, 2027-28 సంవత్సరాల కాలపరిమితికి కౌలు టెండర్ కం వేలంపాట ఈ నెల 13వ తేదీన ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహిస్తామన్నారు. అలాగే పెదపులిపాక గ్రామంలోని శ్రీచెన్నమల్లేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన 3.77 ఎకరాల సాగు భూమిని ఈ నెల 15వ తేదీ ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో 2025-26, 2027-28 కాలపరిమితికి కౌలు టెండర్ కం వేలంపాట నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన పాటదారులు వేలంలో పాల్గొన్నాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం



విజయవాడరూరల్: వేసవిలో ప్రజలు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజయవాడ రూరల్ ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ఎంపీపీ ప్రారంభించారు. కార్యక్రమంలో మండల తహసీల్దారు బీ సుగుణ, ఎంపీడీఓ ఇంచార్జి పీ మురళీకృష్ణ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైయినేజీ సమస్య పరిష్కరించాలని వినతి

గన్నవరం: స్థానిక రాయ్‌నగర్‌లో డ్రైయినేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కాలనీ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు పెద్దు వెంకటరత్నం, కంభంపాటి వెంకటేశ్వరరావు అధికారులను కోరారు. ఈ మేరకు శనివారం ఎంపీడీఓ టీ స్వర్ణలత, గ్రామపంచాయతీ కార్యదర్శి చెన్నకేశవరావుకు వినతిపత్రం అందజేశారు. డ్రైయిన్లలో పూడికలు తొలగించడంతోపాటు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రధాన కూడళ్లల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా మహిళా దినోత్సవం

మహిళామణులకు సత్కారం

పెనమలూరు: మండల పరిధిలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న మహిళా సిబ్బందిని సీఐ జె.వెంకటరమణ శాలువ కప్పి సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. పెనమలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో మహిళలకు సమస్యలు తలెత్తితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఉషారాణి, మహిళా సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పెదపులిపాక గ్రామ పంచాయతీలో మహిళా దినోత్సవాన్ని గ్రామ సర్పంచి గుంటూరు శ్రీనివాసచౌదరి నిర్వహించారు. గ్రామంలో వివిధ శాఖల్లో పని చేస్తున్న మహిళా సిబ్బందికి, గ్రామ పంచాయతీ వార్డు మహిళా సభ్యులకు నూతన వస్త్రాలు బహూకరించి సత్కరించారు. పంచాయతీ కార్యదర్శి తిరుమల వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో...

యనమలకుదురులో ఐద్వా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ఘనంగా చేశారు. ఐద్వా మండల కమిటీ అధ్యక్షురాలు షేక్ వలిబి సభ్యులు కేక్‌కట్ చేశారు. కమిటీ సీనియర్ నాయకురాలు షేక్ బీజాన్‌బి మాట్లాడుతూ మహిళలు సమానత్వంతో పాటు సాధికారిత సాధించాలని పిలుపునిచ్చారు. ఐద్వా కమిటీ సభ్యులు సైకం రమ్యకృష్ణ, లావు అనిత, షేక్ కాశింబి, ప్రజానాట్యమండలి కృష్ణా జిల్లా కార్యదర్శి షేక్ కాశిం పాల్గొన్నారు.

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని వికాస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో ఉమెన్స్ ఎంపవర్మెంట్ సెల్, జాతీయ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన నివేదిత గురుకులం ట్రస్ట్ మెంబర్ డాక్టర్ మైనేని శ్రీలక్ష్మి మాట్లాడుతూ మహిళల పురోగాభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. మహిళా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ శ్రీనివాస్, మహిళా అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

■ నున్న గ్రామంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం శనివారం జరిగింది. ఈ సందర్భంగా మహిళా కార్మికులకు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యర్కారెడ్డి నాగిరెడ్డి, గ్రామ కన్వీనర్ పోలారెడ్డి చంద్రారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు ప్రత్తిపాటి రవీంద్ర, నాయకులు భీమవరపు శివరామిరెడ్డి, ముత్తారెడ్డి పాల్గొన్నారు.



గన్నవరంలో జెడ్పీటీసీ, సర్పంచి, మహిళా వాకర్స్‌ను సత్కరించిన వాకర్స్ కార్యవర్గ సభ్యులు

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

విజయవాడరూరల్: మహిళలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో అభివృద్ధి చెందాలని వక్ఫ్ బోర్డు సర్వే కమిషనర్ షేక్ షరిన్ బేగం (ఐపీఎస్) అన్నారు. విజయవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా షేక్ షరిన్ బేగం మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను లింగ వివక్షత లేకుండా పెంచాలని సూచించారు. ఆడపిల్లలు విద్యావంతులు అయితేనే సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. అనంతరం మహిళా ప్రజాప్రతినిధులను, అధికారులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ పీ మురళీకృష్ణప్రసాద్, ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి,



మాట్లాడుతున్న షేక్ షరిన్ బేగం
వేదికపై ఎంపీపీ, తహసీల్దారు తదితరులు

తహసీల్దారు బీ సుగుణ, మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ విజయ, ఐసీడీఎస్ ఎక్స్‌టెన్షన్ అధికారి జే కవిత, ఎంఈఓ ఎ వెంకటరత్నం, కండ్రిక హెచ్‌ఎం కరుణశ్రీ, ఏఈఆర్‌డబ్ల్యూఎస్ శ్వేత, ఎంపీటీసీ సభ్యులు రత్నకుమారి, సునీత, రామవరప్పాడు, గూడవల్లి సర్పంచ్‌లు పాల్గొన్నారు.

విజయానికి మూలం మహిళ

గన్నవరం రూరల్: ప్రతి ఒక్కరి విజయానికి మూలం మహిళ అని జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి షేక్ ఇమాం కీర్తించారు. మండలంలోని ముస్తాబాదలో శనివారం నవభారత్ హైస్కూల్‌లో జరిగిన మహిళా దినోత్సవంలో పలువురిని సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ షేక్ జాకీరా సుల్తానా అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, మదర్ థెరిస్సా, మలాల, సావిత్రిభాయి పూలే, సరోజిని నాయుడు, కల్పనా చావ్లా మనందరికి ఆదర్శమన్నారు. అనంతరం 10వ తరగతి విద్యార్థుల తల్లులను సన్మానించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంకిపాడు: విజన్ ఇండియా ఆధ్వర్యంలో మహిళా స్నేహపూర్వక గ్రామమైన దావులూరులో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మిని ప్రతినిధులు సత్కరించారు. మహిళాభివృద్ధి పోస్టరును ఆవిష్కరించారు. అనంతరం రాజ్యలక్ష్మి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభ చూపాలన్నారు. కార్యక్రమంలో విజన్ ఇండియా డైరెక్టర్ ఏజే బాబు, జిల్లా పంచాయతీరాజ్ ట్రైనింగ్ మేనేజర్ బీ ప్రభాకర్, పాలకవర్గ ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈడుపుగల్లు జెడ్పీ పాఠశాలలోనూ మహిళా దినోత్సవం జరిగింది. మహిళా ఉపాధ్యాయులను విద్యార్థులు, స్థానిక నేతలు సత్కరించారు. షేక్ సలీం, ఎం జ్యోతిరాణి, సాహిబాసుల్తానా, ఏ పార్వతి పాల్గొన్నారు. అలాగే ఈడుపుగల్లు పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో గ్రామ సర్పంచ్ పందిపాటి ఇందిర, కార్యదర్శి చింతా కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. పంచాయతీ సిబ్బందిని సత్కరించి అభినందించారు.



ఆత్కూరులో మహిళా పోలీస్ సిబ్బందికి సత్కారం

■ కంకిపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో గ్రామసర్పంచ్ బాకీ రమణ, విశిష్ట సేవలు అందిస్తున్న పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఎస్ శివరామకృష్ణ, కార్యదర్శి మద్దుల యుగంధర్, మాజీ సర్పంచ్ బండి నాంచారయ్య, ప్రతినిధులు బండి జ్యోతి, మద్దుల గోవింద్, పంచాయతీ కార్యదర్శి ఎం సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు పాల్గొన్నారు.

ఉయ్యూరు రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మండల పరిషత్ కార్యాలయంలో వెలుగు శాఖలో విధులు నిర్వహిస్తున్న పలు స్వయం సహాయక సంఘాల ప్రతినిధులను ఎంపీడీవో శేషగిరిరావు సన్మానించారు. మండలంలోని పలు స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉంగుటూరు: ఆత్కూరు పోలీస్ స్టేషన్‌లో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళా పోలీస్ సిబ్బందిని ఎస్ఐ సురేష్ సత్కరించారు. మహిళా సిబ్బంది ఎస్ఐ సురేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఉయ్యూరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉయ్యూరు మున్సిపల్ కార్యాలయంలో మహిళా ప్రజాప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది, అధికారులను చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు సత్కరించారు. జూనియర్ సివిల్‌కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన జరిగిన వేడుకల్లో మహిళా సిబ్బందిని సత్కరించారు. మహిళా దినోత్సవ ఆవశ్యకతను న్యాయమూర్తి కె.శ్రీహరి వివరించారు. రోటరీ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు.

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. వాకర్స్ అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్ నేతృత్వంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఎలిజబెత్‌రాణి, సర్పంచ్ సౌజన్య, రచయిత్రి యామిని, మరో 17 మంది మహిళా వాకర్స్‌ను సత్కరించారు. న్యాయవాది తిరివీధి వెంకయ్య, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు. అలాగే మానవత స్వచ్ఛంద సేవా సంస్థ గన్నవరం శాఖ వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురు మహిళలను, ఎంపీడీఓ, డాక్టర్లను సన్మానించారు. స్థానిక రాయ్‌నగర్‌లో జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, వైఎస్సార్ సీపీ మహిళా నేత సూరెడ్డి మణెమ్మను పలువురు మహిళలు సత్కరించారు. వైస్ ఎంపీపీ సాతులూరి శివనాగరాజకుమారి, విద్యా కమిటీ చైర్మన్ రాపాక సుకన్య పాల్గొన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వేడుకలు నిర్వహించారు. సొసైటీ చైర్‌పర్సన్ చిన్ని మాధవి, కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, ఎన్టీటీఎఫ్ కళాశాల ఏఓ పద్మజ పాల్గొన్నారు.



వికాస్ కాలేజీలో మహిళా దినోత్సవంలో డాక్టర్ శ్రీలక్ష్మి, అధ్యాపకులు



ముస్తాబాదలో విద్యార్థుల తల్లులను సత్కరిస్తున్న నవభారత్ హైస్కూల్ యాజమాన్యం



దావులూరులో మహిళాభివృద్ధి పోస్టరు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ రాజ్యలక్ష్మి



పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో మహిళా సిబ్బందిని సత్కరించిన సీఐ వెంకటరమణ

పేరుకుపోయిన పన్ను బకాయిలు

- బాపులపాడులో మందకొడిగా పన్ను వసూళ్లు
- రూ. 5.8 కోట్ల మేర నిలిచిపోయిన వైనం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మేజర్ గ్రామ పంచాయతీకి ఇంటి పన్నుల బకాయిలు గుదిబండగా మారాయి. గ్రామ పంచాయతీ గత పాలకవర్గం హయాంలో చేపట్టిన ఇంటి పన్నుల పెంపుతో వివాదం ఏర్పడింది. సవరించిన ఇంటి పన్నులు చెల్లించేందుకు గ్రామస్తులు నిరాకరిస్తున్నారు. గత తొమ్మిదేళ్లుగా బాపులపాడు పంచాయతీలో ఇదే తంతు నడుస్తోంది. దీంతో ఏటేటా ఇంటి పన్నుల బకాయిలు పేరుకుపోతున్నాయి. తాజా లెక్కల ప్రకారం సుమారు రూ. 5.80 కోట్ల మేర ఇంటి పన్ను బకాయిలు నిలిచిపోయాయి. నిబంధనలకు విరుద్ధంగా పన్నులను సవరించారనే డిమాండ్‌తో పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. మరికొంత మంది స్థానికులు ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు, న్యాయస్థానాలను సైతం ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో గత సార్వత్రిక ఎన్నికల ప్రచారంలోనూ కూటమి నేతలు ఇంటి పన్నులు తగ్గిస్తామంటూ ప్రచారం చేశారు. దీన్ని నమ్మిన గ్రామస్తులకు మళ్లీ పాత కథే ఎదురవుతోంది.

దిక్కుతోచని స్థితిలో గ్రామస్తులు

కూటమి నేతలు తలోమాట చెబుతుండటంతో గ్రామస్తులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఓ వైపు ఇంటి పన్నుల తగ్గింపు కుదరని టీడీపీ నేతలు తెలిచ్చెబుతుండగా, మరోవైపు జనసేన నేతలు మాత్రం ఇంటి పన్నుల చెల్లింపులకు గడువు



బాపులపాడు గ్రామ సచివాలయ కార్యాలయం

కావాలని కోరుతున్నారు. త్వరలోనే ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి ఈ సమస్య తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామంటున్నారు. దీంతో గ్రామస్తులు ఇంటి పన్నులు చెల్లించాలా? వద్దా? అనే మీమాంసలో పడ్డారు. గ్రామంలో ఇంటి పన్ను అసెస్మెంట్లు దాదాపు 4,500 ఉండగా, వీటిలో అధికంగా చెరువుల ఆక్రమణలోని పేదల ఇళ్లే ఉన్నాయి. ఇటీవల బాపులపాడు పంచాయతీ అధికారులు ఇంటి పన్ను బకాయిలు చెల్లించాలని, లేని పక్షంలో చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరిస్తుండటంతో ఈ సమస్య మరింత ముదిరింది. గత టీడీపీ హయాంలో పెంచిన ఇంటి పన్నుల వ్యవహారం ఇప్పటికీ గ్రామంలో కొరకరాని కొయ్యిగా మారింది. పన్ను వసూళ్లు పూర్తిగా మందగించడంతో ఆదాయం లేక పంచాయతీలో పారిశుద్ధ్యం, రోడ్ల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన కుంటుపడింది. బాపులపాడులో ఏళ్ల తరబడి తిష్ట వేసిన ఇంటి పన్నుల పెంపు వ్యవహారాన్ని పరిష్కరించి పన్నుల భారం లేకుండా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కెనడీ ప్రిన్సిపాల్ రత్నకృష్ణకు సత్కారం



విజయవాడరూరల్: ప్రకాశం జిల్లా మార్కాపురంలో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యాన శనివారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామ కెనడీ హైస్కూల్ ప్రిన్సిపాల్ నడిపల్లి రత్నకృష్ణను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సత్కరించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి పాటుపడుతున్న ఆమెను సీఎం చంద్రబాబు అభినందించారు. ఈ సందర్భంగా ఆమె ముఖ్యమంత్రి చేతుల మీదుగా సత్కారం అందుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

క్రమశిక్షణతోనే ఉన్నత విద్య

గన్నవరం: క్రమశిక్షణ, నైతిక విలువలతో ఉన్నత విద్య సాధ్యమని గన్నవరం సీఐ శివప్రసాద్ అన్నారు. స్థానిక విద్యానగర్ నారాయణ హైస్కూల్‌లో శనివారం ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులతో నిర్వహించిన స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్ని ప్రారంభించారు. నర్సరీ విద్యార్థుల విద్య సామర్థ్యాలపై చేపట్టిన ఈ ప్రోగ్రాంను ఎస్ఐ శ్రీధర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా పలువురు మహిళలను సత్కరించారు. ప్రిన్సిపాల్ ఎస్‌కే బాషా, ఏజీఎం సత్తిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్స్ అనూష, శిరీషా, అకాడమిక్ డీన్ బీ నవీన్ పాల్గొన్నారు.



ఎస్ఎల్‌సీ ప్రోగ్రాంను పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐ

సురక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులో సురక్షిత తాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పంచాయతీ కార్యదర్శి ఘంటా రామ్మోహనరావు తెలిపారు. గ్రామంలో శనివారం వాటర్ పైప్‌లైన్ మరమ్మతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా గ్రామంలోని వాటర్‌ట్యాంక్‌లు, మోటారు బోర్ల సాయంతో సరఫరా చేస్తున్నామన్నారు. వాటర్ వర్క్స్ సిబ్బందిని అప్రమత్తం చేశామని పేర్కొన్నారు. పంచాయతీ కార్యాలయానికి అందిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరిస్తున్నట్లు తెలిపారు.

నగర మార్కెట్‌లోకి సరికొత్త వోల్వో ఎక్స్‌సీ90 కారు



రామవరప్పాడు: లగ్జరీ కార్ల తయారీ సంస్థ వోల్వో నుంచి సరికొత్త ఎక్స్‌సీ 90 ఎస్‌యూవీ కారును విజయవాడ రూరల్ మండలం నిడమానూరులోని కృష్ణ వోల్వో షోరూమ్‌లో శనివారం నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణ వోల్వో సీఈవో మోలికా గార్గ్ మాట్లాడుతూ అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఈ ఎక్స్‌సీ 90 కారు రూపుదిద్దుకుందని తెలిపారు. వినియోగదారుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని భద్రతా ప్రమాణాలు, అద్భుతమైన ఇంటీరియర్, ఎయిర్ సస్పెన్షన్ సిస్టమ్, సెంట్రల్ టచ్ స్క్రీన్ వంటి ప్రత్యేకతలతో రూపుదిద్దుకున్నట్లు వివరించారు. రాడార్, ఫ్రంట్ కెమెరాను ఉపయోగించి ఈ కారు లేన్ డ్రిఫ్టులను గుర్తించగలదన్నారు. ఇతర వాహనాలు, పాదచారులు, సైక్లిస్టులు, జంతువులను గుర్తించి స్పందించగల రన్ ఆఫ్ రోడ్ మిటిగేషన్, ఢీ కొనకుండా ఉండే వ్యవస్థలు పొందుపరిచినట్లు తెలిపారు. ఈ కారు ఎక్స్ షోరూమ్ ధర రూ. 1,02,89,900గా ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వినియోగదారులు, షోరూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

పెనమలూరు: యనమలకుదురులో అపార్టుమెంట్ వద్ద పార్కింగ్ విషయమై తలెత్తిన వివాదంతో పలువురు వ్యక్తులు వ్యక్తిపై దాడి చేయడంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ కథనం మేరకు.. గ్రామంలోని సాయినగర్ ప్రాంతంలో సింధు అపార్టుమెంట్‌లో సయ్యద్ రబ్బాని కుటుంబసభ్యులతో ఉంటున్నాడు. అయితే అపార్టుమెంట్‌లో పార్కింగ్ సమస్య గత కొద్ది కాలంగా ఉంది. రబ్బాని తన కారు తీయడానికి అపార్టుమెంట్ గేటు తీస్తుండగా పక్క అపార్టుమెంట్‌లో ఉంటున్న వీరయ్య అనే వ్యక్తి వచ్చి అకారణంగా రబ్బానితో తగాదా పడి దాడి చేశాడు. రబ్బాని ప్రతిఘటించగా వీరయ్య అతనితో వచ్చిన మనుషులు రబ్బానిపై దాడి చేసి రబ్బాని ఇంటి తలుపులు పగులకొట్టారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

8 మందిపై కేసు నమోదు

గన్నవరం: స్థానిక రాజీవ్‌నగర్ సమీపంలోని ఖాళీ స్థలంలోని సరిహద్దు రాళ్లు, కంచెను ధ్వంసం చేసిన ఎనిమిది మంది యువకులపై గన్నవరం పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. కాలనీ సమీపంలోని 28.46 సెంట్ల స్థలంలో గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు సరిహద్దు రాళ్లు, కంచెను ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. స్థల యాజమానుల ఫిర్యాదుతో సదరు విధ్వంసానికి పాల్పడిన రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన ఎనిమిది మంది యువకులను పోలీసులు గుర్తించి వారిపై కేసు నమోదు చేశారు.

కరుణించమ్మా.. కాపాడమ్మా

- భక్తుల కొంగుబంగారం శ్రీలక్ష్మీతిరుపతమ్మ తల్లి
- నేటి నుంచి ఐదు రోజులపాటు తిరునాళ్ల మహోత్సవం

కంకిపాడు: భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం శ్రీ లక్ష్మీతిరుపతమ్మ తల్లి అమ్మవారు. లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ అమ్మవారు పూజలందుకుంటున్నారు. అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలను ఆదివారం నుంచి 14వ తేదీ వరకు నిర్వహించన్నారు. ఐదు రోజులపాటు జరిగే తిరునాళ్లను వీక్షించి తరించేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు తెన్నేరు గ్రామానికి వస్తుంటారు.

తెన్నేరు గ్రామంలోని పచ్చని పంట పొలాల్లో కొలువు దీరిన శ్రీలక్ష్మీతిరుపతమ్మ తల్లి, గోపయ్యస్వామి కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పులుగా ఇక్కడి భక్తులు భావిస్తారు. ఏటా మార్చిలో తిరునాళ్ల జరిపించడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయ నిర్మాణ శతవార్షికోత్సవం సందర్భంగా ఈ ఏడాది తిరునాళ్లు జరిపించనున్నారు. ఇందుకుగానూ ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

ఐదు రోజులపాటు ప్రత్యేక పూజలు

- ఈనెల 9వ తేది ఆదివారం ఆలయ ప్రాంగణంలో గోపూజ, శ్రీచక్రార్చన, కుంభాభిషేకం, చండీ హోమం నిర్వహించనున్నారు.
- 10వ తేదీ ఉదయం అమ్మవారి కల్యాణోత్సవం అనంతరం కల్యాణమూర్తుల గ్రామోత్సవం జరిపిస్తారు.
- 11న శ్రీలక్ష్మీతిరుపతమ్మ తల్లి సమేత గోపయ్య స్వామి విగ్రహ మూర్తులకు అభిషేకం జరుగుతుంది.
- 12న ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.
- 13న ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారు.
- 14న ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుంది.

ఉత్సవాల సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి భక్తులు ఎడ్లబండ్లు, ప్రభలతో తరలివచ్చి అమ్మవారికి మొక్కుబడులు సమర్పించి ప్రసాదాలను స్వీకరిస్తారు. ఉత్సవాలను సమర్థంగా నిర్వహించేందుకు నిర్వాహక ప్రతినిధులు మాగులూరు బ్రహ్మాజీరావు, మాగులూరు సూర్యవరప్రసాదరావు, మాగులూరు మనోజ్‌కుమార్, కేతినీడి కృష్ణకిషోర్, రామకృష్ణ ప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.



ఉత్సవాలకు ముస్తాబైన శ్రీలక్ష్మీతిరుపతమ్మ తల్లి దేవస్థానం